సాక్షి
నల్లగొండ
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



డీఈఓ విచారణ
చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో డీఈఓ భిక్షపతి విచారణ చేపట్టారు. - 10లో



గిరిజన రిజర్వేషన్ పెంచాలి
జనాభా దామాషా ప్రకారం గిరిజన రిజర్వేషన్ పెంచాలని మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
37°/18°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

నల్లగొండ క్రైం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అపూర్వరావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సాంకేతిక అంశాలను ఆధారంగా చేసుకుని సులువుగా డబ్బులు సంపాదిస్తున్న నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఫోన్లకు తెలియని వ్యక్తులు పంపే లింకులు, బీమా వస్తుందని, ఫోన్ రీచార్జ్ అవుతుందని, లాటరీ తగులుతుందని వచ్చే మెస్సెజ్‌లకు స్పందిచవద్దని సూచించారు. ఉద్యోగాలు, వ్యవసాయ పరికరాలు, కొత్త వాహనాలు ఇస్తామని లోన్ యాప్‌లు అంటూ మోసం చెస్తారని పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో మోసపోతే వెంటనే 1930, 155260 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా అలసత్వం చేస్తున్నారని వెంటనే సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం నల్లగొండలో అదనపు కలెక్టర్‌కు నకిరేకల్ మున్సిపల్ కౌన్సిలర్లు పన్నాల పావని, యాసారపు రజిత, చెవుగోని రజిత, వంటిపాక సోమలక్ష్మి వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని.. వాటిని అధికారుల దృష్టికి తీసుకుపోవాలంటే ప్రతి నెలా సర్వసభ్య సమావేశం నిర్వహించేలా చూడాలని కోరారు.


ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అంజన్‌రావు

మర్రిగూడ : ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, బాలరాజు, యాదయ్య, భాస్కర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి



సమీక్ష నిర్వహిస్తున్న రవీంద్రనాయక్

నాగార్జునసాగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్, ఫ్యామిలీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ డా. రవీంద్రనాయక్ అన్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల సహకారంతో గర్భిణుల వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో మిర్యాలగూడ, దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డా. కేశ రవి, డా. కృష్ణకుమారి, డీఎల్‌ఓ నల్లగొండ డా. హరికృష్ణ పాల్గొన్నారు.

బేకరీపై చర్యలు

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలో ఓ బేకరీ షాపులో ఇటీవల బూజు పట్టిన కేక్ అమ్మకంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి స్పందించారు. సోమవారం సాక్షి దిన పత్రికలో పుట్టిన రోజు కేక్ లో బూజు అనే వార్త ప్రచురితమైంది. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆరా తీశారు. ఆ బేకరి షాపును ఆకస్మికంగా తనిఖీ చేయడంతోపాటు షాపు యాజమానిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

• యాదాద్రిలో ధ్వజారోహణం, భేరీ పూజ



యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ధ్వజారోహణం కార్యక్రమంలో గరుడపటానికి పూజలు చేస్తున్న అర్చకులు



రాత్రి నిర్వహించిన భేరీ పూజలో డోలు వాయిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

దాచుకున్నా.. ధర రాలే!

- ప్రస్తుతం రూ.6 వేల నుంచి రూ.7200 వరకు పలుకుతున్న రేటు
- గిట్టుబాటు కాదని అమ్ముకోని రైతులు
- ఇళ్లలోనే పేరుకుపోతున్న పత్తి నిల్వలు!
- ఎండలకు మరింత తూకం తగ్గే అవకాశం



ఎలగలగూడెంతో పత్తి నిల్వలు

నల్లగొండ అగ్రికల్చర్ : పత్తి ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. మొదటి విడతలో పత్తి తీసే సమయంలో క్వింటా రూ.8 వేల నుంచి రూ.9200 వరకు గ్రామాల్లో వ్యాపారులు కొన్నారు. ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7,200 వరకు ధర పలుకుతోంది. అయితే గతేడాది చివరలో క్వింటా ధర రూ.12 వేల వరకు పలికింది. దీంతో రైతులు ధరపై ఆశతో పత్తిని ఇళ్లలో నిల్వ ఉంచుకున్నారు. కానీ, అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి గతంలో మాదిరిగా డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోతున్నాయని మార్కెటింగ్ శాఖ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.6300గా ప్రకటించినప్పటికీ ప్రస్తుతం మార్కెట్‌తో పాటు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.7200 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అయినా.. పత్తి ధరలు పెరుగుతాయన్న ఆశతో రైతులు పత్తిని అమ్మడం లేదు.

6.45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 6.45 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. దాదాపు 50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన అతి వర్షాలకు పత్తి చేలు దెబ్బతిన్నాయి. పూత, పిందె, కాయలు రాలిపోవడంతో పాటు కాయలు నల్లబారిపోయి పత్తి చేలు దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయ శాఖ వేసిన అంచనాలను తలకిందులు చేస్తూ పత్తి దిగుబడి 40 శాతం తగ్గిపోయింది. వర్షాల కారణంగా తెగుళ్లు సోకి పెట్టుబడులు బాగా పెరిగిపోయాయి. దీంతో వచ్చిన పత్తిని రైతులు నిల్వ చేసుకుని మంచి రేటు కోసం ఎదురుచూస్తున్నారు. ఈసారి కేవలం 4.80 లక్షల క్వింటాళ్లు మాత్రమే అమ్ముడైంది. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి ఇళ్లలోనే నిల్వ ఉంది.

నష్టాల పాలయ్యే అవకాశం..

ప్రస్తుతం ఉన్న ధరకు అమ్మితే రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. నిల్వ ఉన్న పత్తిని అమ్మినా, అమ్మకపోయినా రైతుల పెట్టుబడులపై వడ్డీలు పెరిగిపోవడంతో పాటు ఎండాకాలం కావడంతో నిల్వ చేసిన పత్తి తూకం తగ్గే అవకాశం ఉంది. దీంతో నష్టాలపాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి అమ్మబోతే అడవి.. కొరివి అనే సామెత చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

“ ఎకరాకు 5 క్వింటాళ్లే వచ్చింది



ఏడు ఎకరాల్లో పత్తి చేను వేశా. వర్షాల కారణంగా ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. వర్షాలతో పెటుబడులు బాగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఉన్న ధరకు అమ్మితే నష్టాల పాలు కావాల్సిందే. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– డొంకల పరమేష, ఎలగలగూడెం, మునుగోడు మండలం

“ ధర వచ్చాకే అమ్ముతా



ధర లేకపోవడంతో వంద క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ ఉంచా. మంచి ధర వచ్చిన తరువాత అమ్ముదామని చూస్తున్నా. ధరేమో తగ్గిపోతోంది. క్వింటాకు రూ.12 వేల వరకు వస్తే అమ్ముతా. ఇప్పటి ధరకు అమ్మితే ఏమీ మిలగదు.

– కొమ్ము మల్లేష్, మునుగోడు

“ తూకం తగ్గే ప్రమాదం ఉంది



ధర ఎక్కువ వస్తుందని నిల్వ ఉంచాను. ఇప్పటి ధర చూస్తే అమ్మ బుద్ధి కావడం లేదు. ధర పెరుగుడు ఏమో కానీ ఎండల కారణంగా పత్తి తూకం తగ్గి మరింత నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వమే క్వింటా రూ.10 వేలకు కొని రైతులను ఆదుకోవాలి.

–వనం వెంకటయ్య, వెల్మకన్న, గట్టుప్పల్ మండలం

పురుగులతో చర్మంపై దద్దుర్లు..

ఇళ్లలో పత్తిని నిల్వ ఉంచుకోవడం వల్ల పత్తిలోని పురుగులు పారి చిన్న పిల్లలు, పెద్దలు చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. అనేక మంది దద్దుర్లు వచ్చి దురదతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రులకు పోయి మరింత నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

జిరాక్స్ సెంటర్‌లో ప్రశ్న పత్రాలు

- మిర్యాలగూడలో చర్చనీయాంశమైన టెన్త్ ప్రీ ఫైనల్ ప్రశ్న పత్రాల అంశం
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఈఓ భిక్షపతి వెల్లడి

మిర్యాలగూడ : ఈనెలలో నిర్వహించాల్సిన పదో తరగతి ప్రీ ఫైనల్ ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్‌లో లభ్యమయ్యాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ జిరాక్స్ సెంటర్‌లో ప్రశ్న పత్రాలు ఉన్నాయని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని జిరాక్స్ తీయించుకుని సీల్డ్ కవర్‌లో ఉంచి బీరువాలో భద్రపరచాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ పంపిన మెసేజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. డీఈఓ ఆదేశాల మేరకే ఈ మెసేజ్ పంపుతున్నట్లు అందులో పేర్కొనడం వైరల్‌గా మారింది. జిరాక్స్ ఖర్చులు పాఠశాల నిధి నుంచి తీసుకోవాలని సూచించడం కొసమెరుపు. ఈ విషయంపై స్పందించిన డీఈఓ భిక్షపతి.. సమయం లేకపోవడంతో ప్రశ్నపత్రాలను ఎంఈఓలు బాధ్యత పాఠశాలలకు చేర్చామని అప్పగించామని తెలిపారు. జిరాక్స్ సెంటర్‌లో ప్రశ్న పత్రాల విషయాన్ని క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిరాక్స్ సెంటర్‌లో లభ్యమైన ప్రశ్నపత్రాలకు బదులు మరొక సెట్ అందజేస్తామని తెలిపారు.

ప్రశ్న పత్రాలు లీక్ కాలేదు..

– బాలాజీనాయక్, ఎంఈఓ

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డునుంచి ఒక సెట్ ప్రశ్నపత్రాలు మాత్రమే వచ్చినందున ప్రధానోపాధ్యాయులు భద్రతా ప్రమాణాలు పాటించి జిరాక్స్ ప్రతులను భద్రపరుచుకుని పరీక్షలు నిర్వహించాలని ప్రైవేట్ పాఠశాల వాట్సాప్ గ్రూపులలో మెసేజ్ పెట్టాం. ఇవి కేవలం విద్యార్థుల ప్రాక్టీస్ పెంచడానికి సంబంధించిన మోడల్ పేపర్లు మాత్రమే. ప్రశ్నాపత్రాలు ఎక్కడా లీక్ కాలేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తాను పెట్టిన మెసేజ్ మాత్రమే సోషల్ మీడియాలో కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా వైరల్ చేస్తున్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఈ సమయంలో ఇటువంటి అవాస్తవ సమాచారం అందించడం సబబుకాదు.

మెనూ పాటించకుంటే చర్యలు

మునుగోడు : ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పాటించని ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈఓ కె.నర్సింహా హెచ్చరించారు. మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏజెన్సీ నిర్వాహకులు మెనూ పాటించకపోవడంతో మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విధిగా వారంలో మూడు రోజులు విద్యార్థులకు గుడ్లు అందించడంతోపాటు రుచికరంగా కూరలు వండిపెట్టాలని సూచించారు. మెనూ పాటించలేని నిర్వాహకులు స్వచ్ఛందంగా తప్పుకోవాలన్నారు.

కొత్తగా 26 వేల 4జీ టవర్ల ఏర్పాటు



సెల్ టవర్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న చాగంటి శ్రీనివాసరావు

- బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాసరావు

చందంపేట : దేశవ్యాప్తంగా కొత్తగా 26 వేల బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు మంజూరయ్యాయని.. వాటిలో మొదటిది చందంపేట మండలంలో ఏర్పాటు చేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం చందంపేట మండలంలోని చాపలగేటు వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్ టవర్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతమైన నల్లమల ఏరియాలో బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. చాపలగేటు వద్ద ఏర్పాటు చేసే సెల్ టవర్ ద్వారా 3 కిలోమీటర్ల పరిధిలో సిగ్నల్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ మురళీ, జిల్లా జనరల్ మేనేజర్ వెంకటేశం, డీజీఎం రమణ, బండాడ గ్రూప్ చైర్మన్ రాఘవేందర్‌రావు, సర్పంచ్ నెహ్రూ, అధికారులు సూర్యమూర్తి, మల్లేశ్, సత్యనారాయణ, ప్రసాద్, ఉమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై అనాసక్తి..!

- గ్రామాల్లో పనులకు హాజరుకాని కూలీలు
- రోజూ 50 నుంచి వంద మందికి పని కల్పించాలని నిబంధన
- కేవలం 20 మంది వరకే వస్తున్న వైనం
- ఒక్క నెలలో లక్ష్యం చేరుకోవడం కష్టమే..



ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు

నల్లగొండ : వలసలను నివారించి గ్రామంలోనే పని కల్పించి కూలీలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకంపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు, కూలి డబ్బుల చెల్లింపులో జాప్యంతో కూలీలు పనులకు రావడం లేదు. ప్రతి గ్రామంలో రోజూ 50 నుంచి 100 మంది కూలీకు పని కల్పించాలని నిబంధనలు ఉన్నా.. 20 మందిలోపే పనులకు హాజరవుతున్నారు. దీంతో ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో తీసుకొచ్చిన పథకం నీరుగారిపోతోంది.

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు..

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మార్చి నాటికి 1,60,000 జాబ్ కార్డు కలిగిన కుటుంబాలకు.. ఒక కోటి 3 లక్షల పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి నెల ముగింపు దశకు వచ్చింది. ఇప్పటివరకు 54 లక్షల పనిదినాలు మాత్రమే పూర్తి చేశారు. మార్చి ఒక్క నెలలోనే 49 లక్షల పనిదినాలు కల్పించడం సాధ్యం కాదని స్పష్టమవుతోంది.

కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో జాప్యం

ప్రభుత్వం ఉపాధి పనుల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. ఆ సాఫ్ట్‌వేర్‌లో మళ్లీ ప్రతి జాబ్‌కార్డు కలిగిన కూలీల ఆధార్ కార్డు, జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌ను అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో పనులు చేసినా కూలి డబ్బుల చెల్లింపుల్లో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. దీనికి తోడు ఉపాధి పనుల విషయంలోనూ మొదట ప్రతి గ్రామంలో 20 పనులు మాత్రమే గుర్తించాలని చెప్పింది. ప్రస్తుతం వాటిని 260 వరకు పెంచింది. అయితే ఆ పనులకు వెళ్లిన కూలీలు ఎన్ని గంటలు పని చేయాలి. ఎన్ని మీటర్ల పరిధిలో పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందనే విషయంలో కూలీలకు అవగాహన కల్పించకపోవడంతో రోజు కూలి రూ.150 నుంచి రూ.160 వరకే వస్తోంది. కానీ, బయట వ్యవసాయ పనులకు వెళ్తే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయి. దీంతో కూలీలు ఉపాధి పనులకు రావడం లేదు.

అవగాహన కల్పించాలని ఆదేశాలు..

గ్రామాల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి నుంచి జిల్లా అధికారులను ఆదేశాలు అందాయి. జిల్లాలో గ్రామ స్థాయిలో ఉన్న 2.71లక్షల కూలీలకు అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చూడాలని సూచించారు. ఒకవేళ క్షేత్రస్థాయి సిబ్బంది, ఇటు అధికారులు కూలీలకు అవగాహన కల్పించి కూలి డబ్బులు ప్రతి వారం అందే విధంగా చర్యలు తీసుకున్నా లక్ష్యం చేరుకోవడం కష్టసాధ్యమేనని తెలుస్తోంది.

ఆడిట్‌లో తేలిన అవకతవకలపై విచారణ

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో తేలిన అవకతవకలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సామాజిక తనిఖీలు, స్త్రీనిధి రుణాల రికవరీపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, డీఆర్‌డీఓలతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఓ కాళిందినితో కలిసి ఏపీఓలతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లేబర్ డిమాండ్ కనుగుణంగా ఉపాధి హామీ కింద పనులు గుర్తించాలన్నారు. వాచ్ అండ్ వార్డ్‌తో పాటు కూలి రూ.257 వచ్చేలా పనిపై అవగాహన కలిగించాలన్నారు.

అగ్రకులాల పరిపాలన మాకెందుకు

- డాక్టర్ విశారదన్ మహారాజ్



పాదయాత్రగా వెళ్తున్న విశారదన్ మహారాజ్

నార్కట్‌పల్లి : ఆంధ్రోళ్ల రాజ్యం మాకొద్దు అని అన్నప్పుడు.. తెలంగాణలో అగ్రకులాల పరిపాలన మాకెందుకని డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రశ్నించారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం నార్కట్‌పల్లి, ఏనుగులదోరి, బ్రహ్మణవెల్లెంల గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10శాతం లేని అగ్రకులాలు తెలంగాణను పరిపాలిస్తున్నాయని మండిపడ్డారు. సబ్బండ కులాల స్వరాజ్యం కోసం రాజీలేని పోరాటం నిర్వహించాలన్నారు. పదుల సంఖ్యలో ఉన్న అగ్రకులాలు రాజకీయ పార్టీలు పెట్టుకున్నప్పుడు.. 90శాతం మంది ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజకీయ వేదిక ఉండొద్దా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సైదులు, నాయకులు వినోద్ యాదవ్, వెంకటాచారి, మధు, ప్రవీణ్, యుగేందర్, శంకర్, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’కు దరఖాస్తుల వెల్లువ

- నల్లగొండ, మిర్యాలగూడలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అప్లికేషన్లు
- ఇళ్ల కేటాయింపులో రిజర్వేషన్లు
- ఎస్సీలకు 17, ఎస్టీలకు 06, మైనార్టీలకు 12 శాతం
- దరఖాస్తులపై ప్రారంభమైన థర్డ్‌పార్టీ విచారణ



నల్లగొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. నీలగిరి పట్టణంలో 552, మిర్యాలగూడ పట్టణంలో 525 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. ఈ రెండు చోట్ల నిర్మించిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన పేదలకు రిజర్వేషన్ల ప్రకారం కేటాయించనున్నారు. ఆయా పట్టణాల్లో వారీగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా, నల్లగొండ పట్టణంలో రెండు రోజుల్లోనే 4,539 మంది దరఖాస్తు చేసుకోగా, మిర్యాలగూడలో 9,304 దరఖాస్తులు వచ్చాయి. వందల్లో డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఉండగా, దరఖాస్తులు వేల సంఖ్యలో వస్తున్నాయి.


టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక తొలిసారి..

టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పేదలకు ఇళ్లు ఇవ్వడం ఇదే తొలిసారి. దీంతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న, ఉపాధి కోసం, పిల్లల చదువుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పట్టణాల్లో ఉంటున్న వారు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. నీలగిరి పట్టణంలో 20 వేల వరకు, మిర్యాలగూడ పట్టణంలో 15 వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత శాఖల అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి నీలగిరిలో ఈనెల 26 వరకు, మిర్యాలగూడలో నేటితో గడువు ముగియనుంది.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 06 శాతం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. మిగతా ఇళ్లను బీసీలు, ఓసీలకు కేటాయించనున్నారు. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా బీసీలకు, ఓసీలకు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇళ్ల కేటాయింపుల్లో ఆయా పట్టణాల్లో ఇళ్లు లేని వారికి, గుడిసె, రేకులు, అద్దె ఇంట్లో ఉన్న వారికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

“ వేరే ప్రాంతాల అధికారులతో విచారణ



డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం చేసుకుంటున్న దరఖాస్తుదారులపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం థర్డ్ పార్టీ విచారణ కొనసాగుతోంది. మున్సిపల్ అధికారులతో కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన రెవెన్యూ, పంచాయతీ రాజ్ సెక్రటరీల ద్వారా విచారణ చేస్తున్నాం. అర్హులైన పేదల జాబితాను ఈ అధికారుల టీం ద్వారా గుర్తిస్తాం.

– రమణాచారి, మున్సిపల్ కమిషనర్

కుటుంబ వివరాల సేకరణ..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు థర్డ్ పార్టీ విచారణ కూడా ప్రారంభమైంది. దరఖాస్తుదారుల వివరాలను వారు చెప్పిన చిరునామా ప్రకారం, ఆధార్, ఫుడ్ సెక్యూరిటీ కార్డును పరిగణనలోకి తీసుకొని కుటుంబంలోని అందరి ఆర్థిక వివరాలు తెలుసుకుని అర్హులను గుర్తించనున్నారు. ఆయా పట్టణాల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కాకుండా ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న రెవెన్యూ, పంచాయతీ సెక్రటరీల ద్వారా విచారణ కొనసాగుతోంది. అధికారులపై స్థానిక ప్రజా ప్రతినిధులు ఒత్తిడి లేకుండా బయటి వారి ద్వారా విచారణ చేయిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

కవలల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న కవలలు

రామగిరి(నల్లగొండ) : కవలల దినోత్సవం సందర్భంగా న్యూస్ పాఠశాల కరస్పాండెంట్ గంట్ల అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి మంగళవారం పాఠశాలలో కవలలతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆన్వి, ఆద్వి, సాయికీర్తన, సాయిభార్గవి, కుతిస్‌రెడ్డి, కుందన్‌రెడ్డి, ప్రణవ్, ప్రణతి, పర్వత్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ సురేష్‌కు సన్మానం


ఎస్‌ఐని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చండూరు(గట్టుప్పల) : శివరాత్రి ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన గట్టుప్పల మండల ఎస్‌ఐ సురేష్‌ను శివాలయ దేవస్థానం కమిటీ సభ్యులు బుధవారం దేవస్థానంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు మాదగాని సత్తయ్య, ఉపాధ్యక్షులు చెరుపల్లి ఆంజనేయులు, పులిపాటి సత్తయ్య, కార్యదర్శి గంజి కృష్ణయ్య సహాయ కార్యదర్శులు బొల్లెపల్లి వెంకటేశంగౌడ్, కోశాధికారి కర్నాటి వెంకటేశం కార్యవర్గ సభ్యులు మోదుగు సత్తిరెడ్డి, చిట్యాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన గూడపూరి సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తన రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. అతడికి బీఆర్‌ఎస్ నేత బచ్చుపల్లి గంగాధర్‌రావు ఇటీవల రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. సైదులు తల్లి కూడా ఇటీవల మృతి చెందింది. దీంతో సైదులుకు గంగాధర్‌రావు బుధవారం రైస్ కుక్కర్ అందించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ లక్ష్మీనారాయణ, ఎర్ర దయాకర్, కోటగిరి రాధాకృష్ణ, శేఖర్, నాగరాజు, సతీష్, రాజు, కోటేష్, సంపత్, శివ, సందీప్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే సాయన్నను అవమానించిన ప్రభుత్వం’

నల్లగొండ టౌన్ : కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనాలతో జరపకుండా కేసీఆర్ ప్రభుత్వం అవమానం చేసిందని బహుజన సమాజ్ పార్టీ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ పంబాల అనిల్‌కుమార్, నల్లగొండ నియోజవర్గ ఇన్‌చార్జ్ వంటపాక యాదగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు దున్న లింగస్వామి ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కాబట్టే ప్రభుత్వం సాయన్నను అవమానపర్చే విధంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఇప్పటికైనా బహుజనులు మేల్కొని బహుజన సమాజ్ పార్టీకి మద్దతిచ్చి బహుజన రాజ్య స్థాపనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి కొల్లోజు వినోద్‌చారి, మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా, పెరిక అభిలాష్, బొజ్జ నర్సింహా, ఫహీముద్దీన్, దర్శనం అమృత్‌రాజ్, కొండ అభినవ్, ముస్కు సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

మర్రిగూడ : మండల కేంద్రంలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ మాస నీలిమాచంద్రశేఖర్, కర్నాటి రాజమణిరామయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నల్ల యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, పానుగోటి విజయరామారావు, పందుల యాదయ్యగౌడ్, పాల్గొన్నారు.

బీమా పత్రాలు అందజేత

చిట్యాల : మున్సిపాలిటీలోని పదో వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గుండపల్లి లింగస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున బీమా ఉండడంతో మంజూరైన రెండు లక్షల రూపాయల విలువ గల బీమా పత్రాలను బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలి

నకిరేకల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో కోతుల బెడద నివారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోతులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, పుట్ట సత్తయ్య, లగిశెట్టి శ్రీనివాస్, ఎర్కలి అంజయ్య, అక్కెనపల్లి సైదులు, ఆదిరాల దుర్గారావు, మర్రి బక్కయ్య, కోటి లింగం, జిల్లా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక అవస్థలు !

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న వెలిమినేడు పంచాయతీ కార్మికులు
- ధర్నాలు చేసినా పట్టించుకోని పాలకవర్గ సభ్యులు


ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు(ఫైల్)

చిట్యాల : వారు రోజంతా కష్టపడి పనిచేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం పనిచేస్తుంటారు. వారికి ఇచ్చే వేతనాలు అతి తక్కువ అయినప్పటికీ సకాలంలో ఇవ్వడం లేదు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో జీపీ కార్మికులు తమ కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు.

ధర్నాలు చేసినా పట్టింపు లేదు..

వెలిమినేడు గ్రామ పంచాయతీలో 18మంది వరకు కార్మికులు వివిధ పనులను నిర్వర్తిస్తున్నారు. వీరిలో బిల్ కలెక్టర్లు, వీధుల్లో లైట్లు వేసేవారితోపాటు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరికి గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, (డిసెంబర్ నెల వేతనం చెల్లించారు), జనవరి నెలల వేతనాలను గ్రామ పంచాయతీ ద్వారా చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లించాలని రెండుమార్లు కార్మికులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించారు. కొద్ది రోజులపాటు విధులను బహిష్కరించారు. తమకు వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ, ఎంపీఓలకు విన్నవించుకున్నారు. అయినప్పటికీ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులుగానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో వారు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కష్టించి పనిచేసినప్పటికీ వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఆ గ్రామ పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. తమకు రావాల్సిన వేతనాలను చెల్లించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

వేతనాలు సక్రమంగా రావడం లేదు



నిరంతరం పనిచేస్తున్నప్పటికీ వేతనాలు సక్రమంగా రావడం లేదు. దీంతో కుటుంబ పోషణకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు స్పందించి మా కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.

–కానర్ల యాదయ్య, జీపీ కార్మికుడు, వెలిమినేడు

వేతనాలు చెల్లించాలి



మా గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. కార్మికులకు వేతనాలు ఇవ్వాలని వారితో కలిసి ఇప్పటివరకు రెండుమార్లు ధర్నాలు చేశాం. ఆందోళన చేసినప్పుడు వేతనాలు ఇస్తామని అధి కారులు హామీ ఇస్తున్నారు. కానీ ఇవ్వడం లేదు. కార్మికుల వేతనాలను ఏకమొత్తంలో చెల్లించాలి.

–దేశబోయిన స్వరూప, ఎంపీటీసీ, వెలిమినేడు

త్వరలో చెల్లిస్తాం

వెలిమినేడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలను చెల్లించాల్సి ఉంది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య సమన్వయం లేకపోవడంతో గత ఏడాది సెప్టెంబర్ నెల నుంచి బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది. త్వరలోనే జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నాం.

–పద్మ, ఎంపీఓ

గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం


సిలార్‌మియాగూడెంలో శంకుస్థాపన చేస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : గ్రామాలను అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెంలో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదే విధంగా దేవాదాయ శాఖ సర్వశ్రేయోనిధి ద్వారా రూ. 50 లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ సీతారామాంజనేయ ఆలయ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిప్పర్తి మండలంలోని పజ్జూరులో రెండు ఆలయాలకు రూ. 45 లక్షల నిధులు, సిలార్‌మియాగూడెం గ్రామానికి రూ. 50 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అర్హత ఉన్న అన్ని ఆలయాలకు దూపదీప నైవేద్యానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలింగారావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, లోడంగి గోవర్ధన్, సర్పంచ్ ఎర్రమాద కవితనరేందర్‌రెడ్డి, రొట్టెల రమేష్, వనపర్తి నాగేశ్వర్‌రావు, కందుల రేణుకలక్ష్మయ్య, జాకటి మోష తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించడమే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యం


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

మునుగోడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కస్తూరి ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కిష్టాపురం, ఊకొండి, కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహేష్, కంచర్ల రామకృష్ణ, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలి


బోయగుబ్బలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో పూర్తిచేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నకాపర్తి, బోయగుబ్బ గ్రామాల్లో సుమారుగా రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ బి.లాజర్, ఎంపీపీ కొలను సునితవెంకటేష్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరి, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, బోయగబ్బ సర్పంచ్‌లు మర్రి జలంధర్‌రెడ్డి, బోయపల్లి వాణిశ్రీనివాస్, కంచర్ల సునితవెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, ఉప సర్పంచ్ నూతి సత్యశ్రీ వెంకటేశం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్యయాదవ్, ఎంపీటీసీలు ముద్దసాని నీతారమణారెడ్డి, ఉప్పరబోయిన అంజమ్మస్వామి, దేవరపల్లి సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మండలంలోని బోయగుబ్బ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం.లింగస్వామి గ్రామంలో వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో నలభై మంది విద్యార్థులు ఉన్నారని, ఉన్న రెండు గదుల్లో ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం, మరొక గదిలో తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు


నకిరేకల్ : పోలీసుల అదుపులో నాయకులు

రామగిరి(నల్లగొండ) : హన్మకొండలో యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల దాడికి పాల్పడడంతో టీ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల్లో నిరసనకు పిలుపునిచ్చారు. ఈమేరకు ముందస్తుగా బుధవారం తిప్పర్తి మండలంలోని కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం ప్రశాంత్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, నాయకులు బద్దం సైదులుగౌడ్, ఏపూరి ఆనంద్, బత్తుల సోమరాజు, వంగూరు గిరి, గుమ్మడవెల్లి యాదగిరి, లక్ష్మణ్, గౌస్‌పాషలు ఉన్నారు.

నకిరేకల్ : హన్మకొండలో యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై జరిగిన దాడికి నిరసనగా యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు కలెక్టరేట్‌ల ముట్టడి నేపథ్యంలో నకిరేకల్‌లో బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టులను టీ పీసీసీ నేత దైద రవీందర్, గార్లపాటి రవీందర్‌రెడ్డి ఖండించారు. అరెస్టయినవారిలో చెనగాని రాజశేఖర్‌గౌడ్, జావాజీ ప్రమోద్, జవీద్ పాష, వంటెపాక నక్షత్, ఆవుల వేణు, పట్టేటి వెంకటేష్, మహేష్, ఉన్నారు.

చిట్యాల : వరంగల్‌లో బీఆర్‌ఎస్ నాయకుల దాడిలో గాయపడిన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌ను పరామర్శించేందుకు వెళ్తున్న చిట్యాల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను బుధవారం ముందస్తుగా చిట్యాల పోలీసులు అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో కందాటి రమేష్‌రెడ్డి, దమనూరి సైదులు, గంగారపు గణేశ్, వళ్ళమల్ల యాదగిరి, చొల్లేటి శ్రీకాంత్ తదితరులున్నారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

చండూరు : హన్మకొండలో యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు నిరసన చేపట్టనున్నారనే సమాచారంతో చండూరు, గట్టుప్పల మండలాల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో పన్నాల లింగయ్య, గండూరి నరసింహ, ప్రవీణ్, వర్కాల యాదయ్య, ఇరిగి శంకర్, ఇడికూడ నరేందర్, రాపోలు వెంకటేశం ఉన్నారు.

ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలి

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నుల బకాయిలను వందశాతం వసూలు చేయాలని ఇంటి పన్నుల వసూళ్ల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి శ్రీపాద రామేశ్వర్ మున్సిపల్ బిల్ కలెక్టర్లను ఆదేశించారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఇంటి పన్నుల వసూలు బకాయిలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీ లోపు ఇంటి పన్నులు చెల్లించని వారిపై మున్సిపాలిటీ–2019 యాక్ట్ ప్రకారం ఇంటి యజమాని ఆస్తులు జప్తు చేయాలని సూచించారు. షాపుల లైసెన్స్‌లను కూడా దుకాణాల యజమానులు రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. అనంతరం మెప్మా విభాగం ఆర్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, మేనేజర్ నుజ్హత్ ఫాతీమా, జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, మెప్మా ఏడీఎంసీ సరిత పాల్గొన్నారు.

విపస్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరన్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణానికి చెందిన విపస్య స్కూల్ విద్యార్థులు హైదరాబాద్ ఐఎఫ్‌ఎస్‌ఓ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థులు బండారు తనుష్ ప్రథమ స్థానం, అద్నాన్ షరీఫ్ ద్వితీయ, చింతరెడ్డి జీజేందర్‌రెడ్డి తృతీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ భరన్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, షీల్డ్స్‌తోపాటు నగదు బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేష్, మానస నాగూర్, షరీఫ్, నిఖా తునిస, నర్సిరెడ్డి, కలమ్మ, విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి


డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో నిర్మిస్తున్న డ్రెయినేజీ, కల్వర్ట్ పనులను ఆయన పరిశీలించారు. కల్వర్ట్, లింకు రోడ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. గొల్లగూడ, పెద్దబండ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయాలి

నీలగిరి పట్టణంలోని డైట్ కాలేజీలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రమణాచారి తనిఖీ చేశారు. దరఖాస్తుదారుల పేర్లు విధిగా రిజిష్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ రాములు, డీఈలు అశోక్, వెంకన్న, ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్


గట్టుప్పలలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటల గారడీతో మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పెద్దసూరారంలో నిర్వహించిన బీజేపీ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి ఇప్పటివరకు ఇవ్వలేదని, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. అన్ని కార్పొరేషన్‌లలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహ, కిశోర్, రామి రెడ్డి, రాములు, భార్గవి, ప్రవీణ్, నందిని పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

చండూరు (గట్టుప్పల) : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం గట్టుప్పల మండల కేంద్రంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కొంగరి పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నిరంకుశ, నియంతృత్వ పాలనను తరిమికొట్టాలంటే బీజేపీని బూత్ స్థాయిలో పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండా భవానిప్రసాద్, జిల్లా కార్యదర్శి వేదాంతం గోపినాథ్, మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, 10 వ వార్డు మెంబర్ ఇడం వెంకటేష్, బూత్ అధ్యక్షుడు కర్నాటి శ్రీనివాస్, బానావత్ రాజు తదితరులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

నకిరేకల్ : బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్.ప్రదీప్ అన్నారు. నకిరేకల్‌లో ఇటీవల మృతి చెందిన బీజేపీ కార్యకర్తలు నర్సింగ్ నాగరాజు, నడికుడి రవి కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, మండల, పట్టణ అధ్యక్షులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, పల్స శ్రీనుగౌడ్, నాయకులు పాలడుగు నగేష్, నారగోని వెంకటేశ్వర్లు, బుడిగె సైదులు, నర్సింగ్ శ్రవణ్, మిర్యాల యాదగిరి, నడికుడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం : తపాలశాఖ ప్రవేశపెడుతున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో గల సబ్ పోస్టాఫీస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలో తపాలశాఖ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు పోస్టాఫీసుకు రాకుండానే ఆన్‌లైన్ పద్ధతిలో ఇంటివద్ద నుంచే పోస్టల్ ఖాతా తెరుచుకోవచ్చన్నారు. ఇప్పటికే పోస్టాఫీసు సేవింగ్ ఖాతా కలిగి ఉన్నవారు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రికరింగ్ డిపాజిట్, ఫిక్స్‌డ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ఓపెన్ చేసుకోవచ్చన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన


మున్సిపాలిటీ ఎదుట ఆందోళన చేస్తున్న భాగ్యనగర్ కాలనీవాసులు

నల్లగొండ టూటౌన్ : తమ గేటెడ్ కాలనీ నుంచి కొత్తగా చేస్తున్న వెంచర్‌లోకి రోడ్డు ఇచ్చేది లేదని, కాలనీలో కొత్త వెంచర్‌కు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ నల్లగొండ పట్టణంలోని ఎస్‌ఎల్‌బీసీ సమీపంలోని భాగ్యనగర్ కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ బాధ్యుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వెంచర్ చేసి తమకు ఇళ్లు అమ్మిన బిల్డర్ బషీరుద్దీన్ గేటెడ్ కాలనీ అని చెప్పి, ఇప్పుడు కొత్త వెంచర్ వారికి వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. కాలనీవాసులు అభ్యంతర చెబితే బెదిరిస్తున్నాడని అన్నారు. గేటెడ్ కాలనీ అని మోసం చేసిన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, మోహన్, నీరజ, సునీత, సరిత, కమల, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మమత, పద్మ, పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


చిట్యాల : చిన్నకాపర్తిలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు పాఠశాలలో..

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీరాచారి, ఉపాధ్యాయులు ఎం.కిరణ్మయి. బి.అచ్చమ్మ, ఎం.లింగమల్లు, ఎం.శోభరాణి, ఎండీ.నయూమున్నీసా, డి.విక్రం, కె.సుచరిత తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో గల సౌమ్య విద్యామందిర్‌లో విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, ప్రిన్సిపాల్ బొడిగె విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రాణి, వేణు, రొండి మాధవి, మర్రి రామలింగం, కోనేటి యాదగిరి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న స్నేహితులు

శాలిగౌరారం : రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన మండలంలోని భైరవునిబండ గ్రామానికి చెందిన దండ నరేందర్‌రెడ్డి కుటుంబానికి అతడితో కలిసి చదువుకున్న ఎస్సెస్సీ 1995–96 బ్యాచ్ స్నేహితులు బుధవారం రూ.23,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, నంద్రాల నర్సింహ, బండారు సైదులు, శ్రీనివాస్, రుద్రారం నర్సింహ, గండసిరి సత్యనారాయణ, తీపిరెడ్డి జలేందర్‌రెడ్డి, తాటిపాముల జానయ్య, ఏశబోయిన బచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

శాలిగౌరారం : దేశసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి శీలం భద్రయ్య, నాయబ్ సుబేదార్ చంకిలాల్ అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు బుధవారం పాసింగ్ ఔట్‌పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, అంకితభావం ముఖ్యమని, అవి ఎన్‌సీసీలో చేరిన ప్రతి విద్యార్థికి శిక్షణలో అలవడుతాయన్నారు. కార్యక్రమంలో హవల్దార్ మహ్మద్ తాజుద్దీన్, మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శీలం భద్రయ్య

నట్టల నివారణ మందుల పంపిణీ

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్ బుధవారం ప్రారంభించారు. పశు వైద్యాధికారి బిక్యానాయక్, ఎంపీటీసీ మల్లెబోయిన శ్రీలతకృష్ణ, గోపాలమిత్ర శ్రీనివాస్, సిబ్బంది సంజయ్, సైదమ్మ ఉన్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని తొండల్‌వాయి గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవినాయక్ సర్పంచ్ చింత సుధాకర్, గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షుడు దాసరి భూపాల్, నర్సింహ, సుజాత, గోపాలమిత్ర రమేష్, అంజి, రైతులు ఉన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

నార్కట్‌పల్లి : మండలంలోని దాసరిగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ అనంతలక్ష్మి రవీందర్‌రెడ్డి, సైదిరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చిట్యాల : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బుధవారం నల్లగొండకు చెందిన ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీం డాక్టర్ల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్లీవమ్మ, డాక్టర్ గాయత్రి, ఫార్మాసిస్ట్ విజయ్‌కుమార్, ఏఎన్‌ఎం కవిత, ఉపాధ్యాయులు భిక్షపతి, విజయలక్ష్మీ, శ్రీదేవి, రూప పాల్గొన్నారు.